నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 25 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

## కరెంట్ కోతలు ఎక్కువయ్యాయి..

యా దేశంల లేనట్ల సీఎం కేసీఆర్ సారు ఎవుసానికి 24 గంటల కరెంట్‌ను ఫ్రీగా ఇచ్చిండు. రైతులు మంచిగుండాలె.. పంటలు బాగా పండాలె.. అని ఎన్నెన్నో చెప్పిండు.. చేసిండు. కరెంట్ పోవుడనేదే లేకుండా చేసిండు. ఇప్పుడేమో ఇష్టమొచ్చినట్ల కరెంట్ పోతుంది. పోతే ఎప్పుడొస్తదో కూడా తెలుస్తలేదు. పంటలకు, ఇండ్లకు అదే పరిస్థితి. ఫ్రీ కరెంట్ అన్నరు.. కానీ కోతలు ఎక్కువైనయి. ఇలాగైతే ఫ్రీ ఇచ్చి ఏం లాభం? రైతులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు. ఇండ్లల్ల అయితే పరిస్థితి దారుణంగా ఉంది. కేసీఆర్ సారు ఉన్నప్పుడు అందరి గురించి ఆలోచించి 24 గంటల కరెంటిచ్చిండు. ఇప్పుడేమో రాత్రింబవళ్లు తేడా లేకుండా కోతలు పెడుతున్నారు. కరెంటు సారోళ్లకి అడిగితే పైనుంచి పోతుంది అంటరు. ఎప్పుడుపడితే అప్పుడు కరెంట్ పోతే ఫిర్యాదు చేయమని రేవంత్‌రెడ్డి సారు చెబుతున్నడు. సమస్యను చెప్పుకుందామంటే అధికారులు ఫోన్లు ఎత్తరు. ఎవరికి చెప్పినా వేస్ట్‌గానే ఉంది. తెలంగాణ రాకముందు పడిన కష్టాలు మళ్లీ గుర్తొస్తున్నయి. ఇప్పటికైనా కాంగ్రెసోళ్లు కరెంట్ మీద దృష్టిపెట్టి నిరంతరం ఇస్తే బాగుంటది. పాత సర్కారోళ్లు అట్ల చేసిండ్రు, ఇట్ల చేసిండ్రు అనుకుంట ఉంటే.. ప్రజల పరిస్థితి ఎప్పుడు అర్థం చేసుకుంటరు. గొర్రెలెన్ని సచ్చినయనేది ముఖ్యం కాదు.. వడ్లెన్ని పండినయనేదే ముఖ్యం.

*- బోయ బలరాం, పిన్నెంచెర్ల, ఆత్మకూరు మండలం, వనపర్తి జిల్లా*

## కాంగ్రెస్ రాకతో మళ్లీ 'కట్'కట..

అప్పట్లో కరెంట్ కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఆరు గంటలు కూడా ఇవ్వకపోయేది. పగలు మూడు గంటలు, రాత్రి మూడు గంటలు ఇచ్చేటోళ్లు. చీకట్ల పొలంకాడ నిద్ర కాసేది. ఒక్కోసారి కరెంట్ ఇచ్చేటోళ్లు కాదు. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటిచ్చిండు. కరెంట్ మీద ఫికర్ లేకుండా వేరే పని చేసుకునేవాళ్లం. కరెంట్ కోసం రాత్రి పూట పొలం కాడికి పోతలేం. ఇంటి వద్ద కుటుంబంతో హాయిగా నిద్రపోతున్నాం. కేసీఆర్ వచ్చినంకనే కరెంట్ కష్టాలు తీరాయి. కాంగ్రెస్ రావడంతో కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.

*- మొగులాన్, రైతు, ఉమ్మాపూర్, వంగూరు మండలం*

# కోతలకు చేయిచ్చారు..

- కాంగ్రెస్ సర్కారు పాలనలో కరెంట్ కోతలు..
- ఉన్నకాడికి నీటిని వాడుకుందామంటే కరెంట్ లేదు..
- కేసీఆర్ హయాంలో హాయిగా నిద్రపోయాం..
- ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా గోసపడుతున్నాం..
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

## ఇచ్చే కంటే తీసే సమయమే ఎక్కువ..

వానకాలంలో వర్షం ఎప్పుడొస్తదో తెల్వదు. కాంగ్రెస్ గవర్నమెంట్ ఉచిత కరెంట్ ఇస్తమన్నరు కానీ.. ఇచ్చే టైంకన్నా తీసే టైం ఎక్కువగా ఉంది. పొలం పనులు కావడంతో పగలంతా పొలంకాడికి వెళ్తున్నాం. రాత్రి పూట ప్రశాంతంగా ఇంటికాడ పడుకుందమంటే సమయం, సందర్భం లేకుండా కరెంట్ తీస్తున్నరు. రాత్రి పూట కరెంట్ లేక కంటిమీద కునుకు లేకుండా పోయింది. చాలా ఏండ్లు కరెంట్ సమస్య మర్చిపోయి ప్రశాంతంగా ఉన్నాం. ఒకవేళ పోయినా వెంటనే సరిచేసి కరెంటిచ్చేటోళ్లు. ఇప్పుడు కరెంట్ ఎందుకు తీసిండ్రని అడిగితే పైనుంచి పోయింది.. మేమేం చేస్తమని సమాధానం చెబుతున్నరు.

*- కుర్వ శ్రీనివాసులు, ధర్మాపూర్, అమరచింత మండలం, వనపర్తి జిల్లా*

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రి, ఎమ్మెల్యేలు

# నాలుగో యూనిట్‌ను సిద్ధం చేయాలి

- అధికారుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- పనుల్లో అలసత్వం వహించిన అధికారులపై ఆగ్రహం
- టెండర్లకు ఆహ్వానం పలకాలని సూచన
- సాంకేతిక లోపాలు పునరావృతం కావద్దని హెచ్చరిక

శ్రీశైలం, జూన్ 24 : శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రంలో అన్ని యూనిట్లను త్వరితగతిన సిద్ధం చేసి విద్యుదుత్పత్తి చేపట్టాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం హైడల్ ప్రాజెక్టును విద్యుత్‌సౌధ సీఎండీ రుద్వీ, మాజీ సీఎండీ హెచ్‌ఆర్ అశోక్‌కుమార్, హైడల్ డైరెక్టర్ వెంకట్‌రాజన్, సీఎండీ హెచ్‌ఆర్ అజయ్‌లతో కలిసి విద్యుత్ కేంద్రం సర్వీస్ బేస్‌లో పర్యటించారు. నాలుగోయూనిట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులర్పించి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రెండోసారి యూనిట్ ట్రయల్‌రన్ ఫెయిల్ అవడానికి గల కారణాలను తెలుసుకొని అధికారులపై సీరియస్ అయ్యారు. లోపభూయిష్టమైన సాంకేతిక పరికరాల వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు వచ్చే నష్టాన్ని వివరించి అటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కిందిస్థాయి ఉద్యోగుల నుంచి సీఈవో వరకు ఒకే కుటుంబంలా సమిష్టిగా త్వరితగతిన నాలుగో యూనిట్‌ను సిద్ధం చేసి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయాలన్నారు. అనంతరం కాన్ఫరెన్స్‌హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగో యూనిట్ పునరుద్ధరణకు కావాల్సిన రూ.2 కోట్ల అంచనా వ్యయాన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా 2006 లో రికార్డుస్థాయిలో 26వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసిన విధంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం సంస్థ సీఈ సూర్యనారాయణ, ఎస్‌ఈ ఆదినారాయణ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

***శ్రీశైల మల్లన్న సన్నిధిలో ప్రముఖులు..***

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామిని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, తుడి మేఘారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ఈవో పెద్దిరాజు స్వాగతం పలికారు.

## గద్వాల అదనపు కలెక్టర్ బదిలీ

గద్వాల, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ బదిలీ అయ్యారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా కూకట్‌పల్లికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గద్వాల అదనపు కలెక్టర్‌గా 2022 నవంబర్ నుంచి బాధ్యతలు నిర్వర్తించారు.

# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే బండ్ల

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు, జూన్ 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో దవాఖానకు తరలించి ఆపదలో అండగా నిలిచారు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి. సోమవారం మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో కార్, బైక్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ధరూరు నుంచి కారులో వెళ్తున్న ఎమ్మెల్యే ప్రమాదాన్ని గమనించి తన వాహనంలో గాయపడిన వ్యక్తిని దవాఖానకు తరలించారు. అంతేకాకుండా డాక్టర్‌కు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆపదలో ఎమ్మెల్యే చూపిన చొరవకు అక్కడున్న స్థానికులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట గట్టు ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు ఉన్నారు.

## చినుకు కోసం చిన్నారుల పూజలు

ఊట్కూర్, జూన్ 24 : వరుణుడి రాక కోసం కర్షకులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వానకాలం ఆరంభంలో కురిసిన వర్షానికి మండలంలో రైతులు పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేశారు. వారం రోజులుగా వర్షం జాడ లేకపోవడంతో ఊట్కూర్ మండలంలోని మల్లేపల్లిలో సోమవారం చిన్నారుల శివలింగం, పోతురాజు, బొడ్రాయి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. వర్షాలు లేక మొలకలు ఎండిపోతుండగా, వరుణ దేవుడు కరుణ చూపాలని వేడుకున్నారు.

# కష్టాల పాలు

కల్వకుర్తి మండలం తాండ్ర గేట్ వద్ద హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న పాడి రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

# పాడి రైతుల పరేషాన్

- మూడు విడుతల పాల బిల్లులు పెండింగ్
- రూ.5 కోట్ల బకాయిలు
- రోడ్డెక్కిన పాడి రైతులు
- ఇదేమి రైతు సంక్షేమ ప్రభుత్వమని మండిపాటు
- మద్దతు తెలిపిన రైతు సంఘాల నాయకులు

కల్వకుర్తి, జూన్ 24 : కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి విజయ డెయిరీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న పాల సేకరణ కేంద్రానికి పాలు పోస్తున్నాడు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ నిర్వహిస్తూ వచ్చిన డబ్బులతో తన పిల్లలను చదివించుకుంటున్నాడు. పిల్లల చదువులు, నెలవారీ ఖర్చులకు ఆ కుటుంబానికి పాలబిల్లే ఆధారం. వారి పిల్లలు హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ ఇంజినీరింగ్ అభ్యసిస్తున్నారు. వారికి నెలనెలా ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. గోవర్ధన్‌రెడ్డికి 15రోజులకు దాదాపు రూ.20వేల వరకు పాలబిల్లు వస్తుంది. కాగా, మూడు విడుతలుగా (15రోజులకు ఒక విడుత) పాలబిల్లు రావడం లేదు. పిల్లల చదువులకు కచ్చితంగా డబ్బులు పంపాల్సి ఉండగా, పాల బిల్లు రాకపోవడంతో చేసేది లేక చివరకు వడ్డీ వ్యాపారి వద్ద డబ్బులు తీసుకొని పిల్లలకు పంపించాడు. ఇది కేవలం గోవర్ధన్‌రెడ్డి ఒక్కడి పరిస్థితే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా విజయ డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులందరిది. పాలబిల్లులు రాకపోవడంతో, డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

***జీతం లాగానే పాడి రైతులకు పాలబిల్లులు..***

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు నెల జీతం మాదిరిగానే పాడి రైతులకు కూడా ప్రతి 15 రోజులకోసారి ఇచ్చే పాల బిల్లే ఆధారం. వ్యవసాయంతోపాటు పాడిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయానికి పెట్టుబడులు, విద్యార్థుల చదువులకు, ఇంటి సరుకులకు ఇలా పాల విక్రయం ద్వారా వచ్చిన డబ్బులే ఆధారం. 15 రోజులకు చెల్లించే పాల బిల్లు మూడు విడుతలు (45 రోజులుగా) పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈనెల 30వ తేదీ దాటితే మరో విడుత పెండింగ్ అవుతుంది. ఇన్ని రోజులుగా డబ్బులు ఇవ్వకుండా ఉంటే తమ బతుకులెట్లా సాగాలని ప్రశ్నిస్తున్నారు.

***కాంగ్రెస్ సర్కారొచ్చాకే కొత్త సమస్య..***

నాగర్‌కర్నూల్ జిల్లాలో పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని విజయ డెయిరీ మూడు విడుతలకు రూ.5కోట్లకుపైగా బకాయిలు ఇవ్వాల్సి ఉన్నది. ఈనెల 30వ తేదీ వస్తే నాలుగవ విడుతకు మరో రూ.కోటిన్నరకు పైగా కొత్త బకాయి వచ్చి చేరుతుంది. ప్రతి 15రోజులకు ఒకసారి నేరుగా పాడిరైతుల ఖాతాల్లోకి వచ్చే పాల బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గాడి తప్పింది. రైతు సంక్షేమ ప్రభుత్వమని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే కానీ క్షేత్రస్థాయిలో సమస్యలను పెంచుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేలు చుట్టపుచూపుగా నియోజకవర్గాలకు వచ్చిపోతున్నారే తప్పా తమ కష్టాలను ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకుపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

***రోడ్డెక్కిన పాడిరైతులు..***

పాల బిల్లుల కోసం పాడి రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొన్నది. పాలబిల్లులు చెల్లించాలని రైతులు ధర్నా, రాస్తారోకోలు చేస్తున్నారు. పాలకు డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని రెండు రోజుల కిందట కల్వకుర్తి నియోజకవర్గం కల్వకుర్తి మండలం తాండ్ర గేట్ వద్ద శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై పాడిరైతులు ధర్నా, రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాడిని నమ్ముకొని మనుగడ సాగిస్తున్న తమకు పాల బిల్లులు సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. పాల బిల్లుల పెండింగ్ విషయమై జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ యాదవ్‌ను వివరణ కోరగా, ప్రభుత్వానికి సమస్యను వివరించామని, వారం రోజుల్లో మూడు పెండింగ్ బిల్లులు వస్తాయని సమాధానమిచ్చారు.

## రైతులంటేనే చిన్నచూపెందుకు?

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాల ఉత్పత్తిలో కల్వకుర్తి మొదటి స్థానంలో ఉన్నది. ఈ ప్రాంత రైతు బిడ్డలు ఎక్కువగా పాడినే నమ్ముకుంటారు. ఎంత పెద్ద వ్యవసాయం ఉన్నా.. పాడి మాత్రం ఖచ్చితంగా ఉంటుంది. ప్రతి 15 రోజులకు వచ్చే పాల బిల్లు పాడి రైతులకు జీవనాధారం. పాల బిల్లు మూడు విడుతలు గా రాలేదు. ఈనెల 30వ తేదీ వస్తే నాలుగోవి డుత కూడా వస్తుంది. పాలబిల్లులు రాకపోవడంతో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రభుత్వమని చెప్పే కాంగ్రెస్ పెద్దలకు రైతుల సంక్షేమం పట్టదా?. రైతులను నిర్లక్ష్యం చేస్తే ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. మూడు విడుతల బకాయిలను చెల్లించడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న రూ.4 ప్రోత్సాహకాన్ని కూడా వెంటనే విడుదల చేయాలి.

*- బండెల రాంచంద్రారెడ్డి, రైతు సంఘం నాయకుడు, కల్వకుర్తి*

కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం

డ్తాల మండల కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం ఎదుట రాస్తారోకో, ధర్నా చేపట్టారు. రోడ్డుపై పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. అలాగే సోమవారం కల్వకుర్తి మండలం తాండ్ర గేట్ వద్ద శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై పాడిరైతులు ధర్నా, రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాడిని నమ్ముకొని మనుగడ సాగిస్తున్న తమకు పాల బిల్లులు సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. పాల బిల్లుల పెండింగ్ విషయమై జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ యాదవ్‌ను వివరణ కోరగా, ప్రభుత్వానికి సమస్యను వివరించామని, వారం రోజుల్లో మూడు పెండింగ్ బిల్లులు వస్తాయని సమాధానమిచ్చారు.

# పంతులు లేకుంటే పాఠాలెలా?

- పిల్లల భవిష్యత్‌ను నాశనం చేస్తారా?
- ఐదు నెలలుగా హెచ్‌ఎం డుమ్మా
- ఓబులోనిపల్లి ప్రభుత్వ పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- ఐదు తరగతులకు ఒక్క ఉపాధ్యాయుడే..

పాఠశాల గేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ధరూరు, జూన్ 24 : పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది సర్కారు బడుల పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌ను తలదన్నేలా వసతులు, విద్యాబోధన అందుతుందని బడిబాట పేరుతో గొప్పలు చెప్పి తీరా ఆచరణలో మాత్రం వసతుల సంగతి అటుంచితే కనీసం చదువు చెప్పేందుకు పంతులు లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు.. దీంతో చదువు చెప్పేదెవరని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ధర్నా చేసిన ఘటన మండలంలోని ఓబులోనిపల్లిలో చోటుచేసుకున్నది. తల్లిదండ్రులు మాట్లాడుతూ ఓబులోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం దామోదర్‌గౌడ్‌తో పాటు ఒక్క ఉపాధ్యాయుడు చిరంజీవి నాయుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నాడన్నారు. దామోదర్ వ్యక్తిగత కారణాలతో జనవరి నుంచి డ్యూటీకి రావడం లేదని ఆరోపించారు. పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు దాదాపు 128 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల పునఃప్రారంభమైన నాటి నుంచి ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే చదువు చెబుతున్నారు. ఐదు నెలలుగా అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించేందుకు గ్రామస్తులంతా గద్వాలకు వెళ్లారు.

**పాఠశాలకు రాకపోవడం వాస్తవమే..**

హెచ్‌ఎం పాఠశాలకు రాకపోవడం వాస్తవమే. వేతనం కూడా నిలిపివేశాం. సమస్యను గురించి డీఈవోకు రిపోర్ట్ పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో తగిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం బదిలీలు ఉన్నందున ఉపాధ్యాయులను పాఠశాలకు పంపించేలా చర్యలు చేపడుతాం.

*- సురేశ్, మండల విద్యాధికారి, ధరూరు*

మహబూబ్‌నగర్ జిల్లా దవాఖాన ఎదుట నినాదాలు చేస్తున్న జూనియర్ డాక్టర్లు

# వేతనాలిస్తేనే వైద్యసేవలు

- మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో జూనియర్ డాక్టర్ల సమ్మె

మహబూబ్‌నగర్, జూన్ 24 : తమకు నెలనెలా వేతనాలు ఇస్తేనే ప్రజలకు వైద్యసేవలు అందిస్తామని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ దవాఖానలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు దవాఖాన ఆవరణలో టెంట్ వేసుకొని సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ నుంచి ప్రభుత్వానికి తమ గోడు వెల్లబోసుకుంటున్నామని, సమ్మె నోటీసులు సైతం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మెలో జూనియర్ డాక్టర్లు సాయిరాం, అభిషేక్, తేజశ్రీ, తేజస్సు, సహజ, ప్రణయ్, శృతి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వదలరా..?

- కొల్లూరు పాఠశాలలో ఉపాధ్యాయుల మొద్దు నిద్ర
- గతేడాది టెన్త్‌లో జీరో రిజల్ట్

కొల్లూరు పాఠశాలలో నిద్రిస్తున్న ఉపాధ్యాయులు

నవాబ్‌పేట, జూన్ 24 : ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు సర్కారు చేర్యలు చేపడుతున్నా కొంత మంది ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నవాబ్‌పేట మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం 3గంటలకు స్టాఫ్ రూమ్‌లో నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో టేబుల్‌పైనే ఇద్దరు ఉపాధ్యాయులు నిద్రిస్తుండగా, మరో ఉపాధ్యాయుడు సెల్‌ఫోన్‌లో నిమగ్నమయ్యారు. మరో ఉపాధ్యాయుడు మాత్రం రికార్డు వర్క్ చేస్తూ కన్పించాడు. అక్కడికి వెళ్లిన రిపోర్టర్లు ఫొటోలు తీసి సార్ అని పిలువగా, నెమ్మదిగా నిద్ర మత్తులో నుంచి తేరుకొని ఎవరు మీరు అంటూ ఎదురు ప్రశ్నలు వేశారు. లీజర్ పీరియడ్ ఉన్నందుకే నిద్రిస్తున్నామని తెలిపారు. కాగా, కొల్లూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై కొంతకాలం నుంచి విమర్శలున్నాయి.

2022–23 విద్యాసంవత్సరంలో కొల్లూరు పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో జీరో ఫలితాలు వచ్చాయి. ఈ విషయమై జీహెచ్‌ఎం శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. తాను ఇటీవలే జీహెచ్‌ఎంగా పదోన్నతి పొంది ఇక్కడికి వచ్చానని, బదిలీల బిజీ ఉన్నందున ఎవ్వరినీ ఏం అన లేకపోతున్నామని చెప్పారు.

# మూడు మేకలిస్తా..

- భర్తను చంపాలని భార్య సుపారీ
- హత్య కేసులో నిందితుల అరెస్ట్

జడ్చర్ల టౌన్, జూన్ 24 : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీ శివారులోని మేకల మంద వద్ద నిద్రిస్తున్న ఆంజనేయులు అనే వ్యక్తి హత్య కేసులో నలుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన ఆంజనేయులు(45) ఈనెల 21వ తేదీ రాత్రి తన ఇంటి సమీపంలోని మేకల మంద షెడ్డు వద్ద నిద్రిస్తుండగా హత్యకు గురయ్యాడు. ఈనెల 22న ఉదయం అతడి కుటుంబసభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఆదిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆంజనేయులు భార్య భాగ్యలక్ష్మిని అదుపులోకి తీసుకొని విచారించారు. కూతురు మరో యువకుడిని ప్రేమిస్తున్న నేపథ్యంలో ఆంజనేయులు తన కూతురితో అసభ్యంగా ప్రవర్తించాడన్న నెపంతో భాగ్యలక్ష్మి భర్తను చంపేందుకు ఇంటి పక్కన నివాసముంటున్న మరో ముగ్గురు నిందితులైన మైసమ్మ, నర్సింహ, ముత్యాలమ్మకు సుపారీ ఇచ్చింది. ఆంజనేయులును చంపితే 3 మేకలు ఇస్తానని చెప్పి హత్యకు పథకం వేసింది. దీంతో ఈనెల 21వ తేదీన రాత్రి మేకల మంద షెడ్డు వద్ద ఆంజనేయులుతో కలిసి నిందితులు మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ఆంజనేయులును నిందితులు కత్తితో గొంతుకోసి చంపినట్లు విచారణలో ఒప్పుకొన్నారని సీఐ చెప్పారు. ఈ మేరకు భాగ్యలక్ష్మి, మైసమ్మ, నర్సింహ, ముత్యాలమ్మను అరెస్ట్ చేసి జడ్చర్ల కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

మైనింగ్ మాఫియాతో మాట్లాడుతున్న గ్రామస్తులు

## మైనింగ్ మాఫియా అడ్డగింత

ధన్వాడ, జూన్ 24 : ఎస్‌వీఎస్ మైన్స్ అండ్ మినీరాల్ కంపెనీ ప్రతినిధులు యాదయ్య, ఫయాజ్‌లు సోమవారం మండలంలోని గున్ముక్ల గట్టును పరిశీలిస్తుండగా, గ్రామస్తులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. వారిని గ్రామ పంచాయతీ వద్దకు పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఇక్కడికి రామని రాత పూర్వకంగా కంపెనీ తరపున లెటర్ రాసి ఇవ్వడంతో కంపెనీ ప్రతినిధులను వదిలేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మైనింగ్ కోసం ఎవరైనా వస్తే సహించేది లేదని హెచ్చరించారు.